# రజ్జు సర్ప భ్రాంతి

-నాగరాజు గంధం

కౌంటర్‌లో టోకెన్ తీసుకుని చిల్లర సరిచూసుకునేంతలోనే రైలు కూత పెట్టింది - హడావుడిగా ప్లాట్‌ఫారమ్ మీదకి జొరబడి ... పరుగున 'కూతవేటు' దూరాన్ని దాటి రైలెక్కే సరికి – తగని రొప్పు... 'పరుగులెత్తి దేన్నీ అందుకునే వయసు కాదిది' - స్వగతించుకున్నాడు ఉమాశంకరం.

రైలు వేగం పుంజుకుంది.

అలు పాపుకుంటాని కన్నట్టు క్షణకాలం కళ్ళు మూసుకుని ఉన్నచోటే కదలకుండా నిలబడి - సేద తీరిందన్నాక నుదిటికి పట్టిన చెమట తుడుచుకుని - తీరుబాటుగా తేరిపారా కంపార్ట్‌మెంట్ అంతా కలియజూశాడు... ఉమాశంకరం - రద్దీలేదు... ప్రశాంతంగా కునకొచ్చు అనుకునేంతలో తననెవరో పరీక్షగా గమనిస్తున్నట్లు... తోచింది... తనూ ఆవైపు చూశాడు - 'ఆడమనిషి' - ఖాళీగా ఉన్న ఎదురు సీటు మీద కాళ్ళు పెట్టి... కిటికీకి చేరగిలబడి తదేకంగా అతనివైపే చూస్తోంది. ఉమాశంకరం కళ్ళు నిశితంగా పరీక్షించినాయ్ ఆమెని. ఒకటి రెండు తెల్లపాయలు మెరిసినా... ఒత్తుగా తెలుస్తున్న తలకట్టు. కొంచెం విశాలంగానే అన్పిస్తున్న నుదురు - సన్నగా తీర్చిదిద్దినట్టున్న కనుబొమ్మలు, సూటిగా కొనదేరి, కొనకి చిన్న నొక్కు తేలిన నాసిక - ఇంద్రచాపాన్ని తిరగేసినట్టున్న వత్తయిన కింద పెదవి వంపు నీడన తళుక్కున మెరుస్తున్నట్టు పుట్టుమచ్చ - 'లీలాలు' - ఆమెని గుర్తుపట్టిన మరుక్షణం రైలు కుదుపుకి కావచ్చు తూలిపడిపోయాడు ఉమాశంకరం- ఉమాశంకరాన్ని గుర్తుపట్టే ప్రక్రియలో అతనివైపు తదేకంగా చూస్తున్న ఆ 'లీలాలు' అనబడే 'లీల' అతనలా తూలి బడటం చూసి - తన సంశయాత్మకత నుండి బయటపడి - ఫక్కున నవ్వి... లిప్తలోనే 'జాగ్రత్తసుమా' అన్న కవళికను ముఖంలో అమర్చుకుని ఫక్కున నవ్విన నవ్వును పలకరింపు నవ్వుగా మార్చేసింది -

"మీరు శంకరంమంచి గౌరీశంకరం గారే కదూ?"

ఈసారి రైలు కుదుపు లేకపోయినా తూలిపడ్డంత పనయ్యింది ఉమాశంకరానికి...

'ఔరా! గౌరన్నయ్య' అనుకున్నాడు - ఏళ్ళు గడిచినా గౌరన్నయ్య స్మృతి నుంచి బయటపడలేదు లీలాలు -

"ఏమిటలాగ చూస్తున్నారు?... పోల్చుకోలేకపోయారు కాబోలు... నేను లీలని"...

మరే... లీలాభామవి కూడా ... ఖంగుమనే ఆ గొంతు విన్నాక సందేహం కూడానూ అనుకుని - పైకి మాత్రం -

''అయ్యో గుర్తుపట్టకనే... లీలాలు'' అనేశాడు...

ఆమె ఒక క్షణం సిగ్గుపడ్డట్టుగా కన్పించింది - మరుక్షణం సిగ్గు చిరుకోపానికి తిరిగింది.


... గొంతు గుర్తుపట్టి అన్నయ్య కాదని పోల్చుకుందా అన్పించిందొక్క క్షణం

"బానే ఉంది 'లీలాలు' బొడ్డుకోసి పెట్టారు కాబోలు - లీలావతి నా పేరు"

రాని కోపాన్ని అభినయించటం - ఏమైనా ఆడాళ్ళ కళ్ళకే గొప్పగా నప్పుతుంది - అనుకున్నాడు ఉమాశంకరం.

ఎదురు సీటుకి చాపిన కాళ్ళని వెనక్కి లాక్కుని - దుమ్ము లేకుండా చేతిలో ఖర్చీఫ్‌తో తుడిచి కూర్చోమన్నట్లు కళ్ళతోనే అభినయించింది లీల–

తన చేతిలో ఉన్న 'మాసిన గుడ్డసంచి' ఆమె కళ్ళబడకుండా వెనక్కి దాచేసి కూర్చున్నాడు



ఉమాశంకరం...

"బాగానే పరుగు పందెం చేసారు... ఈ వయసులో కుర్రాడయిపోదామనే?"... ఏవేవో అర్థాలు ధ్వనించాయ్ ఆ మాటల్లో - తనని గౌరన్నయ్య అనుకునే... ఈ పరాచికం - పోనీ కాదని చెప్పేస్తే... చెప్పేస్తే ఏం వుంది మరేనంటూ ఆ వంపుకి తిరిగి పోగల్దు - మాట మంతి కట్టేసి... లేదా 'పెట్టంతా ఖాళీనేగా మరెక్కడికైనా వెళ్ళి కూర్చోమని పురమాయించినా ఆశ్చర్యం లేదు - లీలా కఠినం - అన్నా అంటుంది -

"కాసిన్ని మంచినీళ్ళు తాగండి" - చేతిలో మంచినీళ్ళ సీసా ఇవ్వజూపుతున్నట్లుగా కొద్దిగా ముందుకొంగింది - చేయిచాపే అందీయొచ్చు - మరి గౌరన్నయ్యా మజాకానా? - గొప్పగా పోగా వేసాడు లీలాలు మనసులో...

సీసా అందుకునేటప్పుడు మునివేళ్ళు తగిలాయ్ – తగిలించింది కాబోలు – చప్పున తనే వెనక్కి సర్దుకు కూర్చుంది – ఆ మాత్రానికే మనసుకి చెమట పట్టినట్టయింది ఉమాశంకరానికి –

ఏమిటో ఈ 'లీలా వినోదం' – తనకుతానే తగిలించటం... తప్పంతా మన మీదకే ఫిరాయించి సర్దుకోవటం – ఓ రెండు గుక్కలు తాగి – సీసా తిరిగి ఆమెకి అందించాడు – ఈసారి తగిలింపులేవి లేవు – కాస్త విశాలంగా వెనక్కి వాలి కూర్చుని – ఆమెని మరింత పరీక్షగా చూసాడు. వయసు తెచ్చిన చిన్నపాటి సహజమైన, హాయైన మార్పులు తప్పించి – జీవితపు వడిలో పడి నలిగిన దాఖలాలేవీ లేవు – కళ్ళలో అతిశయం, నిర్భీతి, వాటితోపాటు అలవోకగా తొంగి చూసే... అల్లరితనం, విలాసం... ఏవీ మారలేదు ముప్పై ఐదేళ్ళనాడు 'చిరుతపులిలా అందంగా ఉంటే... ఇప్పుడు పెద్ద పులిలా అందంగా ఉంది... అంతే...' అనుకున్నాడు.

"మీ తమ్ముడు ఉమాశంకరం ఇప్పుడు ఎక్కడో..." తదేకంగా చూస్తున్న అతని కళ్ళలోకి చూస్తూ హఠాత్తుగా అడిగింది–

పచ్చి వెలక్కాయ్ గొంతులో పడ్డట్టయ్యింది.

'బానే ఉంది సంబడం – మనిషంత మనిషి ఎదురుగా ఉంటే గుర్తుపట్టేది పోయి – పరోక్షంలో ఏకవచన సంబోధనతో ఎంక్వైరీ ఒకటి'–

జవాబురాని అతని వైపు తదేకంగా సాగిన ఆమె చూపు – 'వినపడ లేదేమోనన్న' అనుమానంలోకి సాగేంతలో.. ఎవరో తరిమినట్టు ఠక్కున – "హైదరాబాద్‌లో ఉన్నాడు"– అనేశాడు ఉమాశంకరం

కిటికీలోంచి వస్తున్న గాలికి రేగిన ముంగురులను ఓ చేత్తో సరిచేసుకుంటూ

"పెద్ద నౌకరీనే అయిందటగా... పిల్లలెంతమందో?" అడిగింది ఆరాగా...

తను తనే అన్నది దాచిపెట్టి తన గురించి చెప్పుకోవాలంటే చెడ్డ ఇబ్బందిగా అన్పించింది ఉమాశంకరానికి –

"ఇద్దరూ ఆడపిల్లలే... పెళ్ళిళ్ళు చేసేసాడు"– క్లుప్తంగా నసిగేసాడు.

"ఉమాకెందుకో ఆడపిల్లలు?... నోరు తెరిస్తే అబద్ధాలాడతారు... మీకు పుట్టాల్సింది..." అని ఒక్కసారి విశ్రాంతిగా వెనక్కి జారిగిలబడి – "ఇంతకీ తమరెక్కడో ప్రస్తుతం?" – కాస్త స్వరం తగ్గించి అడిగింది.

'ఇదీ సంగతి! – ఈ భోగట్టా కోసం వ్యవహారయుక్తంగా అదీ ఇదీ అడిగి కొసన అసలు సంగతిలోకి జొరబడటం – లీలానైజం...

"సాంగ్లీలోనే ఉండటం – షుగర్ ఫ్యాక్టరీలోనే ఇంజనీరుగా – మరో నాలుగు నెలల తర్వాత రిటైర్ అవ్వడం" – విషయం నిజమే అయినా మనిషి అబద్ధం కదా!... అయినా లీలముందు గౌరన్నయ్యలోకి ఫిరాయించడం గొప్ప సరదాగా అన్పించింది ఉమాశంకరానికి–

"సాంగ్లి? – మహారాష్ట్ర కాబోలు, రిటైరైపోయుంటారు అనుకున్నా. పర్లేదు సర్వీసులోనే ఉన్నారే"... అంటూ నవ్వింది – ఆ క్షణం ఆమె చూపు, మాట, నవ్వు అన్నీ అల్లరిగా మారిపొయ్యాయి... తెరలు తెరలుగా నవ్వింది – అంత నవ్వెందుకో అర్థంకాలేదు ఉమాశంకరానికి... కొద్ది క్షణాలకి ఆ నవ్వు నుండి తెప్పరిల్లి – కళ్ళవెంట తిరిగిన నీళ్ళను పైటతో ఒత్తుకుని–

"అబ్బ ఎంతకాలమైంది బాబూ ఇంత నవ్వు నవ్వి..." అంటూ తనని తాను సంబాళించుకుంటానికన్నట్టు కొద్ది సమయం ఆగి –

"మరోలా అనుకోకండీ... జుట్టు పూర్తిగా పోయింది మీకు – ఈ బట్టతల చూసే పోల్చాను గౌరీ శంకరంగారని... మీ తమ్ముడు ఉమాకి మీకు తేడా ఈ జుత్తేగా – అతనిది చాలా ఒత్తయిన తలకట్టు... మీ జుత్తు పల్చన – ఇంకా సర్వీసులోనే ఉన్నారంటేను... ఎందుకో నవ్వొచ్చింది"... అంది లీల నవ్వారని మొఖంతో...

ఓర్రోరి జాణతనం.... బట్ట బుర్రలని బట్టి సర్వీసు కౌంటింగా? – ఆ లెక్కన గౌరన్నయ్య జుట్టు చీకేసి పదేళ్ళు దాటిపోయింది – నయం ఏ ఉద్యోగ ఉపసంహారాల మంత్రో కాలేదు

బట్టతలల లెక్కన వి. ఆర్. ఎస్.లు ఇప్పించేది - అనుకున్నాడు ఉమాశంకరం -

"అవునూ... ఇంతకీ ఎంతవరకీ ప్రయాణం?" విషయం బదలాయించడాని కన్నట్టు తనే అడిగింది-

"రాయమండ్రి వరకూనూ... రేపు తెల్లవారు ఝామున్కి మా తోడల్లుడి గృహప్రవేశం"

"మరి ఏలూరులో ఎక్కారు?..."

"పాత స్నేహితుడుంటేను... పలకరింపుకని పొద్దున అక్కడుండిపోయాను... రాత్రికి చేరాలి రాయమండ్రి"

"మరి మీ ఆవిద?" లీల గొంతులో ఏదో మార్పున్నట్టు తోచింది ఉమాశంకరానికి -

"ఆవిద సరాసరి వెళ్ళిపోయింది"

"అంటే సాంగ్లి నుంచి ఆవిద సరాసరి మరిదిగారింటికెళ్ళిపోతే... మీరు మటుకు స్నేహితుల కోసమని ఏలూరులో దిగబడిపోయి - ఇప్పుడు బయలుదేరుతున్నారన్నమాట..."

నోటికొస్తున్న అబద్ధాలు ఆడే సమయంలో ఇలా కింద నుంచి పైకి మళ్ళీ రెట్టిస్తుంటే- చెప్పొద్దూ... ఓ విధంగా కడుపులో బెంగొచ్చేస్తుంది - దొరికిన ఐ.ఎస్.ఐ. వెధవని దొరికినట్టు లీలాలుకి అప్పగిస్తే సరి - ఇంటరాగేషన్‌కి ధోకా ఉండదు - అనుకున్నాడు ఉమాశంకరం

"మీ మాధవి కులాసానేనా? ఇప్పుడు ఎక్కడుందేమిటి?"-

ఎందుకు కులాసాకాదు తల్లి? - దాని పెళ్ళిలోనే కదా! - గౌరన్నయ్య భాగోతం, నీ భాగోతం అల్లరయింది - ఈ నాటికి దెప్పుతారు దాని అత్తగారి వైపువాళ్ళు" మనసులోనే అనుకున్నాడు ఉమాశంకరం

సమాధానం చెప్పకుండా తనవైపు అలాగ చూస్తున్న ఉమాశంకరాన్ని కాస్త కోపంగానే చూసింది లీల-

"అయ్యో బానే ఉంది - నా మాటలు ఆలకించటం లేదా? - చెముడుగాని ఉందా!- అలాగ చూస్తారు నా ముఖాన కోతులేమన్నా ఆడుతున్నాయా?" - వజ్రపు ముక్కుపుడక కాబోలు - ఆమె ముక్కుమీద కోపానికి సాక్కి మెరిసింది

# 'పత్రిక' చందా వివరాలు

కొందరు 'పత్రికా'భిమానులు చందా వివరాలు కావాలని ఉత్తరాలు రాస్తున్నారు. అలాంటి వారి కోసం-

*పత్రిక విడిప్రతి : 5/-*

*ప్రత్యేక సంచిక (ఉగాది, దీపావళి): 10/-*

*సాలుసరి చందా : 60/-*

మీ ఏడాది చందాను మోనికా పబ్లికేషన్స్ పేరిట ఎం.ఓ. లేదా హైదరాబాద్‌లో చెల్లించే విధంగా డి.డి. ద్వారా పంపండి! ప్రత్యేక సంచికలకు, పోస్టల్ ఛార్జీలకు కాగల అదనపు వ్యయాన్ని చందా మొత్తంలో చేర్చడాన్ని పాఠకులు గుర్తించగలరు. దీనిని ప్రత్యేక రాయితీగా పరిగణించి, చందా మొత్తాన్ని వెంటనే ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

**మోనికా పబ్లికేషన్స్**

79బి, జర్నలిస్ట్స్ కాలనీ, జూబ్లీహిల్స్,
హైదరాబాద్-33.

- ఒక్క క్షణం తడబడి నవ్వేసాడు ఉమాశంకరం.

"అబ్బె అదేం లేదే... మాధవికేం బాగుంది - ఖరగ్‌పూర్‌లోనే సెటిల్ అయ్యారు - పిల్లలకి పెళ్ళిళ్ళు చేసేసింది" గడగడా జవాబు చెప్పాక తట్టింది - ప్రశ్నలన్నీ తనవైపునుంచే పడుతున్నాయని - మరీ లీలాలుకి కోపం రమ్మంటే... రాదూ... ఇన్ని వివరాలు తనడుగుతున్నా - ఒక్క ప్రశ్నే అవతల నుంచి రాకపోతే... ఇలా అనిపించగానే వెంటనే అడిగాడు-

"మీరెక్కడ ఉండటం?"-

లీల అదోలా చూసినట్టనిపించింది ఉమాశంకరానికి - అవునుమరి - గౌరన్నయ్య ఏనాడూ 'మీరు-గారు' అనేవాడు కాదు. 'నువ్వు'

అనే పిలిచేవాడు - మొత్తంగా చూస్తే లీలాలికి మొదటి పరిచితుడు తనే అయినా 'మీరు'ని మీరలేదెన్నడూ - అదట్టుంది అనుమానం.

"మా ఫ్యామిలీ అంతా విశాఖలోనే ఉండటం - నాన్నగారూ మా దగ్గరే ఉంటా - మా ఆయన లాయర్‌గానే ప్రాక్టీస్‌లో ఉన్నారు. ఒక్కతే పాప... పోయిన మాఘానికే పెళ్ళికానిచ్చాం - అల్లుడు తనూ స్టేట్స్‌లో ఉంటున్నారు. ఇదిగో విజయవాడలో మా పెద్దాడబిడ్డ అత్తగారు పొయ్యారు... పెద్దావిడే అనుకోండి.... నలుగురి మధ్య ఒక్కరు ఈన - బాగుండదు కదా ఆయనకి కుదరదంటే... ఇహ నేనే చూసొస్తున్నాను"-

మీరు అన్నమాటని - మీ ఫ్యామిలీ అన్న అర్థంతో తీసుకుందన్నమాట - పోనీలే ఉభయతారకం - మళ్ళీ ప్రశ్నకు ప్రశ్న తావివ్వలేదు... భోగట్టా అంతా చెప్పేసింది-

రైలు ఆగింది - తాడేపల్లిగూడెం స్టేషను - దాదాపు రెండు గంటలు ఆలస్యంగా నడుస్తోంది బండి - అప్పుడానికి సాయంత్రం నాలుగున్నరే అయినా... కొద్దిముసురుకి కాబోలు వెలుతురు బాగా తగ్గిపోయి - ఏ ఆరయిందో అనిపిస్తోంది - చల్లటి గాలి... దానికి తోడుగా ఎక్కడో కురుస్తున్న వాన తాలూకు మట్టి వాసన - స్టేషనంతా తాపీగా అన్పిస్తోంది - ప్లాట్ ఫారం మీద పెద్దగా హడావుడిలేదు - రైలాగిన కొద్ది నిమిషాలకి కూడా కొత్తగా ఎవ్వరూ పెట్టెలోకి ఎక్కలేదు... హఠాత్తుగా సిగరెట్ తాగాలన్న కోరిక కలిగింది ఉమాశంకరానికి - లేవడాని కుద్యుక్తుడై...

"ఏవన్నా కావాలా?" - అడిగాడు

ఏవిటో... కిందకి దిగుదామనా? - పెద్దగా ఆగకపోవచ్చు రైలు... ఎందుకు మళ్ళీ ఉరుకులు పరుగులు చెమట్లు, ఆయాసం - రైలు ఆగినప్పుడల్లా పరిగెత్తాల్సిందేనా?-

లీల మొఖం చూస్తేనే అర్థమవుతోంది నవ్వు బిగపెట్టి మాట్లాడుతోందని - చటుక్కున లేచి నిలబడ్డాడు - ఆమె కళ్ళబడకుండా వెనకవైపు దాచిన గుడ్డ సంచి బయటపడింది - దాన్ని చేతిలోకి తీసుకోబోయేంతలో...

"ఎక్కడ సంపాయించారే ఈ మసిగుడ్డ? - నే భద్రంగా చూస్తాలేండి మీరు దిగి రైలు కదలకుండా వచ్చేయండి" - అంది లీల అలలు కదిలినట్టు నవ్వుతూ...

వెధవ గుడ్డసంచిలో తన బట్టలు కుక్కిన ధర్మపత్ని మీద గొంతువరకూ కోపం వచ్చింది - పై పూత నవ్వు నవ్వి కిందకు దిగాడు ఉమాశంకరం - ప్లాట్‌ఫారం మీద నాలుగడుగులు వేసి లీలచూపుకందని దూరం పారి - ఓ మూలగా నిలబడి సిగరెట్ వెలిగించాడు - ఒక దమ్ము లాగాక ... లీలాశీతలమైన హృదయం వేడెక్కి మామూలుగా అయిందనిపించింది-

పాత మసిగుడ్డలాంటి సంచి - బట్టతల - పరిగెడితే ఆయాసం - ఇవన్నీ గౌరన్నయ్యవి కదా! మరి ఉమాశంకరానికేల చింత - అనుకోవటంతో మనసులో ఏదో అర్థంలేని చికాకు సర్దుకున్నట్లయింది - ఇన్నాళ్ళకి ఇన్నేళ్ళకి లీల కనపడటం - అదీ తనని చూసి గౌరన్నయ్య అనుకుని పలకరించడం - ఉమా శంకరం మనసులోని జ్ఞాపకాల తీగని ఎవరో లాగినట్లయ్యింది. ఎప్పటి పరిచయం? - ముప్పై ఐదేళ్ళ ముందు మాటే... గోదావరీ తీరాన కొవ్వూరులో ఉండే రోజుల్లో... రాయమండ్రిలో డిగ్రీ చదువు... సాయంత్రాలలో నాన్నగారితో కలిసి స్వార్థ్యయనం - అలాటి ఓ సాయం వేళ... గుర్రం బండిలోంచి వకీలు సుబ్రమణ్యంగారితో సహా వారి గారాల పట్టి - ముద్దుగా 'లీలాలు' అని పిలవబడే లీల దిగింది - వకీలు సుబ్రమణ్యంగారంటే చుట్టుపట్ల పెద్ద పేరు... లీల అమ్మగారి అనారోగ్యానికి కారణం - ఆమె జాతకంలో దొరుకుతుందేమో నన్న ఆలోచనతో - జ్యోతిష్యాది విషయాల్లో అప్పటికి లబ్ధప్రతిష్ఠులైన నాన్నగారిని కలిసి విచారించటానికి ఒచ్చారాయాన - కొద్ది రోజులకే లీల అమ్మగారి ఆరోగ్యం కుదుటపడటం - అలా సుబ్రమణ్యంగారికి... నాన్నగారి పట్ల గురి కుదరటం... రెండు కుటుంబాల మధ్య రాకపోకలకి పాదుపెట్టినట్టయింది - అప్పటికి ఎస్.ఎస్.ఎల్.సి. ఓసారి చీదేసిన లీల

ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతున్న చెల్లాయ్ మాధవి కోసం అన్నట్టుగా ఎప్పుడూ ఇంటికొస్తుండేది ఒచ్చినప్పుడల్లా బోలెడన్ని కబుర్లు పోగేసుకొచ్చేది – ఉమా... ఉమా... అంటూ అవ్వన్నీ నెత్తిన గుమ్మరించేది – ఆమెంతపాటి చనువు చూపించినా – కలవారి పిల్ల... చొరవ తీసుకుందామంటే కొంత భయం – ఆమె ఉద్దేశమేంటో అర్థంకానితనం – ఏవని మొదలు పెట్టాలో తెలీని అనుభవ రాహిత్యం – వెరసి ఏకపక్షవీక్షణంగా ఏడ్చాయి రోజులన్నీ... ఇలా ఉండగా మాధవి పెళ్ళి కుదరడం – ఆ సందర్భంగా మద్రాసులో ఇంజినీరింగ్ చదువుతున్న గౌరన్నయ్య రావడం ఒచ్చీరావడంతోనే – లీలని ఓ వెల్లువలా కమ్మేయడం – క్షణాల్లో జరిగిపొయ్యాయి... ఎందరి ముందైనా చనువుగా లీల పక్కనే కూర్చోవడం – మాటల్లో మాటగా చేతులు పట్టుకోవడం.... గుండంటుకుపోయినట్టుండేది – ఏంవిటి చెయ్యడం? నిష్ఠాతంగా అల్లుకుపోతున్నవాడు సాక్షాత్తు అన్నయ్య – రూపానికి అచ్చుగుద్దినట్టు ఒకేలా ఉన్నా – వయసులో, అనుభవంలో ఎక్కువ మనిషి – కానీ లీల మాత్రం వాడు రాక మునుపు నాతో ఎన్ని కబుర్లు పోగేసేది? –'ఈ లీలని ఏముందిలే... ఏ ఆడదాని లీలైనా ఇంతే– ఎగిరే తుమ్మెద వంకే గానీ పాకే పురుగువైపు ఏ పువ్వు మొగ్గుతుంది? 'అనుకుని విరక్తి పడ్డ క్షణాలు లేకపోలేదు – రేపటిరోజు పెళ్ళనగా సరుకులు సర్దించిన గదిలో గౌరన్నయ్య లీల జడపట్టి లాగడం చూసాక మరి మనసు మనసు కాలేదు – ఆ మర్నాడు రాత్రి ముహూర్తానికి అరగంట ముందు – కుటుంబ సమేతంగా పెళ్ళికొచ్చిన సుబ్రమణ్యంగారు గౌరన్నయ్య చెంప పగులకొట్టి పందిట్లోంచి విసవిస వెళ్ళిపోయారు – పెళ్ళిలో అది నానారకాలుగా గుప్పుమంది – గౌరన్నయ్య నోరు విప్పలేదు... ఆ ప్రకరణం నాన్నగారికి గొప్ప తలవంపులైపోయింది సుబ్రమణ్యంగారి కుటుంబానికి మాకు మధ్య రాకపోకలు పూర్తిగా ఆగిపొయ్యాయి. పెళ్ళయిన ఓ నెల రోజులకి కాబోలు – మాధవే అంది – 'లీలకి పై నెల్లోనే

## స్పందన

-పరిగి రాధాకృష్ణ

బక్కటోణ్ణి తన్ని
భుజ కిరీటం తగిలించుకోవడం గొప్పా?
ప్రజలే దేవుళ్ళని అరుస్తూ
నైవేద్యాలెవరికీ అందకుండా
తామే స్వాహాచేయటం గొప్పా?
అడిగిన నోటికి
నాలుగన్నం ముద్దలు
పెట్టినవాడే కదా మహానుభావుడు!
దాహాన్ని డబ్బుతోనే
తీర్చుకోవాలనుకున్నవాళ్ళకి
ఏ నాటికైనా తీరేనా అది?
త్యాగానికైనా విలువ కట్టలేని
సంకుచితత్వాల నడుమ
ఏ విలువైనా ఎలా నిలుస్తుంది?
మానవత్వమెలా గెలుస్తుంది?
దేన్నయినా
పడగొట్టేందుకున్న తపన
పోషించడానికి లేనపుడు
విలువల సోపానాల
ప్రస్థానానికి నాంది పలికేదెవరు?
వాగ్దానాల్లో విలువల్ని వెతకడం
ఎడారిలో నీటికై తపించడమే!
ఎక్కటం సులభమే అందలాలు
మోసేవాడి భుజాలపై బరువుకూడా
మననం చేసుకుంటూ సాగితే.
స్పందనే మనిషి కారోప్రాణం
అది లేకుండా పంచప్రాణాల్ని
నిలబెట్టుకోవడం మహాయాతన.
అనర్థాల్ని చూసి
తప్పుకుపోయే తత్వానికి
పట్టం కడితే అధోగతే!
చతికిలబడితే ఎంత చట్టమైనా
నిన్ను బతికించదు
బందీనే చేస్తుంది!
అడిగిన ప్రశ్నలకి
డొంక తిరుగుడు జవాబులే వచ్చినా
ప్రశ్నలడుగుతూ వుండాల్సిందే
నిజాలు తేలేవరకూ,
ఏ సమాజంలోనయినా
స్పందించే మనిషికే జవాబులు దొరికేది.
అదే ప్రగతికి పునాదై
బ్రతుకును నిలిపేది!

పెళ్ళి. చాలా పెద్ద సంబంధంట' అని. అది విన్న గౌరన్నయ్య 'ఎంత పెద్ద సంబంధమైతే ఏంటట? మొదట అది శంకరంమంచి వారి ఇలాకానే కదా!" అని వ్యాఖ్యానించాడు - అది విన్న మాధవి కేమాత్రం అర్ధమయిందో - "వీడి మొఖం వెధవ కారుకూతలు" - అంటూ వెళ్ళిపోయింది. అదే లీల గురించి ఆఖరి ప్రస్తావన ఇంట్లో - ఆ తరువాత జీవితపు వడిలో స్మృతుల స్పర్శకి తీరికెక్కడ? - మళ్ళీ ఇన్నాళ్ళకి - రైల్లో తలవని తలంపుగా లీలాదర్శనం-

వేళ్ళు చురుక్కుమనడంతో చేతిలో సిగరెట్ పారేశాడు ఉమాశంకరం - సన్నగా వర్షం మొదలయింది - అరగంటపైనే అయినట్టుంది రైలు నిలబడి... కదిలే ఉద్దేశం లేనట్టు తాపీగా నిలబడుంది రైలు - అయినా గబుక్కున కదిలితే ఇబ్బంది అని - రైలెక్కాడు ఉమాశంకరం-

"ఏవిటి నిత్యాగ్నిహోత్రమా?" మూతిని సున్నాలా చుట్టి రెండు చేతివేళ్ళతో సిగరెట్ పట్టుకున్నట్టు అభినయిస్తూ అడిగింది లీల-

నోరు పుక్కిలించుకోనందుకు చాలా పశ్చాత్తాప పడ్డాడు ఉమాశంకరం.

''వురే... పండిత పుత్రులు కదా! తప్పులేదులేండి"- అంటూ ఓ వెక్కిరింపు నవ్వు నవ్వింది - అంతలోనే ఏదో గుర్తుకొచ్చినట్టుగా... "మీ ఉమా హైదరాబాద్‌లో కదా ఉంటా... అడ్రస్ ఇద్దురూ... మా మూడో ఆడబిడ్డ ఇంటికి వెడుతుంటాం తరచూ... వీలైతే ఓ మారు కలుస్తా..."

గుండెల్లో రాయిబద్దంత వనైంది ఉమాశంకరానికి - కొంప మునగదూ... ఇప్పుడు గౌరన్నయ్యగా చూసి ఆనక కాదని తెలిసిపోతే... ముందు వెనకలు చూడకుండా నిలబెట్టి కడిగేదూ - లీలా దాష్టికం-

'' తెలీదు... అంటే ఎక్కడో డైరీలో రాసుకున్నాను... నోటికి గుర్తులేదు" లీలకళ్ళలోకి చూడకుండా చెప్పాడు ఉమాశంకరం - ఆ మాటకి అతన్ని అదోలా చూసి "ఈ రైలేమిటి? కదలదా... అరగంట నుంచి ఇక్కడే ఆగిపోయింది?" అంది విసుగ్గా-

'నిజమేస్మీ!' అనిపించింది ఉమాశంకరానికి - ప్లాట్‌ఫారం మీద కనిపించిన పోర్టర్‌ని వాకబుచేస్తే - 'నిడదవోలు అవతలో ఏదో గూడ్సు పట్టాలు తప్పిందని - ఈ ఆలస్యం అనంతమని' శెలవిచ్చాడు - ఈ మాట వినడంతోటే... లీలాలు నిరుత్సాహ పడిపోయింది - ''ఎప్పుడు కదులుతుందో తెలీని మేళం - ఎంతసేపని ఇలా కూర్చోగలం?" అని స్వగతంగా అనుకుని

"మీకు తాడేపల్లిగూడెం తెలుసా?..." అంటూ అడిగింది ఉమాశంకరాన్ని.

ఎందుకో అర్థం కాక " పెద్దగా తెలీదు... ఏం?"

" ఏమీలేదు... చీకటిపడుతోంది... పైగా వర్షం... మరీ ఆలస్యమయితే - మా రెండో ఆడబిడ్డ కూతురు ఈ ఊళ్ళోనే గవర్నమెంటు హాస్పిటల్‌లో డాక్టరుగా పనిచేస్తోంది - దానింటికెళ్ళి ఈ పూట ఉండి రేపు వెడదామని..."

''అడ్రస్ లేదా మరి?'' అడిగాడు ఉమాశంకరం

"ఉంది... ఊరు తెలీదు. అదీకాక దానికి రాత్రివేళ డ్యూటీలుంటే - ఇంట్లో అదుండకపోవచ్చు. మళ్ళీ నేనే ఉండాలంటే ఒంటరిగా... భయం"-

ఏవో తెలీని అర్థాలు వినబడుతున్నాయి ఆ మాటల్లో - ఒకవేళ రాత్రంతా ఒంటరిగా ఉండవలసి వస్తే - అలా ఉండటం భయం కనుక - ఊరు మీకు తెలిస్తే తోడుగా రండనా? - ముప్పై ఐదేళ్ళనాడు అనుబంధ పునరుద్ధరణా? - ఏవిటీ లీలార్థం-

"పోనీ నేను తోడుగా రానా?" తెగించి అనగలిగాడు కాని అన్నాక ఎందుకో ప్రాణం కడబడ్డట్టయింది - చటుక్కున తలెత్తి అతనివైపు చూసింది లీల - లీలా వీక్షణాలు అర్థం కావుగా... నెమ్మదిగా తలదించుకుని మౌనంగా ఉండిపోయింది-

మాట జారిపోయానను అనుకున్నాడు ఉమాశంకరం - గుండె వేగం హెచ్చింది - వెధవరాయి. విసరకపోయినా బాగుండేది అనుకునేంతలో - దించిన తల పైకెత్తింది లీల - ఆ ముఖంలో ఏముందో అర్థంకాలేదు-

"రైలు కదిలే సూచనేమన్నా ఉందేమో వాకబు

చేయండి – లేదంటే అలానే వెడదాం!" నింపాదిగా స్పష్టంగా అంది–

ఆ మాటలు విన్న క్షణం ఉమాశంకరం ఒళ్ళంతా జలదరించినట్లు యింది – ఆహ్వానమే... తిరుగేలేదు... ముమ్మాటికీ ఆహ్వానమే... "మొదట శంకరంమంచి వారి ఇలాకా"... అని ఊరికినే అన్నాడా గౌరన్నయ్య? ఎప్పుడో పోగొట్టుకున్నాననుకున్నది ఇప్పుడిలా దొరుకుతోందన్నమాట – కాళ్ళు చేతులు ఆడనట్టయింది కొద్దిసేపు ఉమాశంకరానికి – వాకబుకన్నట్టు రైలు దిగాడు – వర్షపుజోరు హెచ్చుగా ఉంది... దిగీ దిగగానే వర్షపుజల్లు తడిపేయడంతో... ఎందుకో తెలీని కంగారనిపించింది. 'రైల్వే ఎంక్వైరీ' ఎటువైపో తెలీలేదు. వర్షపుజల్లుని తప్పుకుంటానికన్నట్టు ముందుకు పరుగెత్తాడు – చటుక్కున ఎవరో అడ్డంగా రావడం... అంతే! –

ముఖాన మెరుపు మెరిసినట్టయింది ఉమాశంకరానికి – ముందుకు తూలిపడ్డాడు–

"అయ్యో!... జాగ్రత్త మాస్టారు!..." అంటూ ఒకరిద్దరు లేపి నిలబెట్టారు – మరెవరో జేబులోంచి పడ్డ చిల్లరా... కళ్ళజోడు తీసి చేతికిచ్చారు.. ఉమాశంకరానికి అర్థం కాలేదు... అతని ప్రమేయం లేకుండా ఒళ్ళంతా ఒణికిపోయింది – ''రైలు ఎటు తిరిగీ ఆగిపోయింది వర్షంలో దేనికండీ ఈ పెద్దాయన పరుగులు?" అంటున్నారెవరో–

నెమ్మదిగా తనని తాను సంబాళించుకుని – పక్కనే ఓ బెంచిమీద నెమ్మదిగా కూర్చున్నాడు ఉమాశంకరం –

" ఏవిటీ ఆత్రం? ఎక్కడికీ పరుగు?.... ఒకవేళ లీలాలు వెంట వెళ్ళినా ఎంతసేపని గౌరన్నయ్య ముసుగు? – ముఖపరిచయాలైతే పొరబడతాయ్ – అంతకు మించిన పరిచయం కదా వాళ్ళది! ఆనవాలు ఎలాదాగుతుంది? ఆనక ఎంత అసహ్యం? – అయినా చిన్న తూలిపాటుకే ఒళ్ళంతా కంగారై గుండెదడ లెట్టేస్తుంటే... ఒకవేళ లీలాలు కనిపెట్టకపోయినా ఏంవి జరుగుతుందనీ... జరపగలమనీ నా బొంద భ్రమ! –''తన ఆలోచన చాలా సజావుగా అనిపించింది ఉమాశంకరానికి. అలా అనిపించాక – అతని గుండెదడ కాస్త నెమ్మదించినట్లయింది – చేతిలో ఉన్న కళ్ళజోడు వైపు చూసాడు – విరిగిపోయింది – భార్యది – తన కళ్ళజోడు మర్చిపోయొస్తే... 'మీ కవసరం... పేపర్ అదీ చదువుతుంటారు' అంటూ జేబులో పెట్టింది 'పాపం దానికీ అవసరమే' కొత్త ఫ్రేం తీసుకునే ఇంటికెళ్ళాలి – ఓ మూడొందలయినా సరే... దిగ్గున లేచి స్టేషన్ లోంచి బయటికొచ్చాడు – దగ్గర్లో ఉన్న రిక్షా పిలిచి బస్టాండ్‌కు పోనీమ్మంటూ ఎక్కి కూర్చున్నాడు – ఆ క్షణం రైల్లోనే ఉండిపోయిన... మాసిన గుడ్డ నంచి జ్ఞాపకమొచ్చినా లక్ష్యపెట్టలేదు ఉమాశంకరం–

సరిగ్గా అదే సమయానికి... స్టేషన్ బయట మరోవైపు ఆటోలో ఎక్కి కూర్చుని గవర్నమెంట్ హాస్పిటల్‌కి పోనీమంటున్న లీల మనసు పరమకంపరంగా ఉంది–

"వయసుడిగిపోయినా వెధవ బుద్ధులెలా పోతాయ్ం! – రైలెక్కిన దగ్గర నుంచి మిడిగుడ్లేసుకుని ఒకటే చూడటం!... రావణాసుర ముండాకొడుకులు ఓ పట్టాన మారరు కాబోలు... వీళ్ళ తమ్ముడు ఉమా శంకరం ఎలా ఉండేవాడు – ఎంతటి మర్యాద, మన్నన, ఆడవాళ్ళంటే గౌరవం.. చిన్నతనమో ఏమోకానీ నిజానికి అతనిమీది వలపుతోనే కాదూ... అన్నిసార్లు వాళ్ళింటి కెళ్ళేది – మాధవి పెళ్ళి పుణ్యమా అని రాకాసురుడొచ్చినట్టు ఒచ్చి అనుక్షణం వెకిలిగా వేధించుకుతినేవాడు ఈ వెధవ – చివరికి మాధవి పెళ్ళిరోజు పిల్లఘాయిత్యం చేయబోయి నాన్నారి కంటబడి అందరిలో చెంపదెబ్బ తిన్నా ఈనాటికీ గుణం మారలేదు – ఎంత అల్లరైంది ఆరోజు! – నా పెళ్ళి కుదిరేవరకూ నిద్రెరిగారా నాన్నారు? – సొంత తమ్ముడి అడ్రస్ తెలీదట – చుప్పనాతి కబుర్లు కాకపోతే... నవ మన్మథుడ్ని అనుకుంటున్నాడేమో దరిద్రుడు – తోడొస్తాడట! – అవ్వ! నయం వెంటపడ్డాడు కాదు... అయినా తప్పునాది ... పెద్దవాళ్ళమయ్యాం పాత స్పర్ధలు ఏంవిటిలే అని పలకరించినందుకు మా బాగా అయ్యింది – గ్రహచారం కాకపోతే... ఛీ... ఛీ...